

# టేకిట్ ఈజీ!! - 2

## శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



# గొఱ్ఱెశ్రీ

పనిలేని విక్రమార్కుడు (నేనే)ఎప్పటిలాగే ఫేస్ బుక్కు చూసుకుంటున్నాడు. నోరు దానిపని అది చేసుకుపోతోంది. వేళ్ళు నోట్లో వున్నాయి. ఎందుకో బొటనవేలి మొదట్లో నొప్పెట్టి దాన్ని బైటికి లాగి దీక్షగా చూసాను కొంపతీసి గోరుచుట్టేవన్నా వేసిందేమోనని. చూద్దును కదా, గోరు చుట్టూ వున్న భాగాన్నంతా మెల్ల మెల్లగా దొలిచేసి, గోరు ఎప్పుడో తినేసాయి నా పళ్ళు. ఇంక మెల్లిగా వేలుని ఆక్రమించుకుంటుంటే పాపం అది నోరు లేనిది కనక నొప్పెట్టి చెప్పింది, ఆపరా కుయ్యా అని. సరే దాని బాధ అర్థం చేసుకుని, బొటనవేలుంటే ఏ ద్రోణాచార్యుడికైనా ఇవ్వొచ్చును కదా అని, ఉణ్ణిచ్చేసాను. ఇంతలో నా రెండో కూతురొచ్చింది బొమ్మల పుస్తకం పుచ్చుకుని. దానికిప్పుడిప్పుడే మాటలొస్తున్నాయి కాబట్టి ముందు గౌరవంగా రెండు సార్లు "నాన్నా", "నాన్నా" అంది. నాకింకా బుద్ధి రాలేదు కాబట్టి ఫోను వదలకండా టెక్కులు చేసేస్తున్నాను. అది ఓ మాటు తల పంకించి, బుగ్గ మీద వేలెట్టుకుని కాసేపు ఆలోచించి, ఆనకో డెసిషనుకొచ్చి, నా మోకాలుమీద కసుక్కున కొరికేసి, బుక్కు చేతికిచ్చింది. నేను ముందు కెవ్వు మని ఒక విహ్వల మైన కేక పెట్టి, అనక ఓ చిరునవ్వు విసిరి, ఆ శాల్తీని వొళ్ళో కూర్చోపెట్టుకుని మొదలెట్టాను.

"ఇదేంటీ, ఇది పిల్లి, పిల్లేవందీ..మ్యావ్..." అంటూ.

ఓ నిముషమైందో లేదో మొదటి శాల్తీ వచ్చింది. నాన్నా "మేక మే అంటుంది కదా..మరీ గొఱ్ఱె ఏవంటుంది?" అని.

నేను ఎప్పటిలాగే మొదటి తప్పుగా క్షమించి పట్టించుకోలేదు.

అది మళ్ళీ అడిగింది. "చెప్పు నాన్నా, గొఱ్ఱె ఏవంటుంది?".

నాకు చిఱ్ఱెత్తి "వెళ్ళి గొఱ్ఱెనడుగు" అన్నాను చిరాగ్గా.

"గొఱ్ఱె ఎక్కడుంది నాన్నా? నాకు సర్ప్రైజా? నువ్వు కొనితెచ్చావా? చూపించవా? ప్లీజ్.." అని మొదలెట్టింది.

నావల్లకాలేదు.

వెంటనే రెండో దాన్ని దాని చేతికిచ్చి,

"మా అమ్మ కదూ. పది నిముషాలు ఆడించు. నేను గంటలో వచ్చేస్తాను..అర్జెంటు" అని బాత్రూం లోకి పరిగెత్తి గెడేసుకుని ఊపిరి పీల్చుకున్నాను.

బాబోయ్, కూతుళ్ళు కాదు గానీ, కూరొండుకు తినేస్తున్నారు. అందుకే ఇలాంటి పెశ్నలూ గట్రా వెయ్యకండా ఉండేందుకే చిన్నప్పుడు కుమారీ శతకాలు గట్రా బట్టీ పట్టించేవారు. ఆ పద్యాలు నోటికొచ్చేసరికి వాళ్ళు ఎలాగూ పెద్దవాళ్ళైపోతారు గాబట్టి, అమ్మా నాన్నలు కాస్త స్థిమితంగా కూర్చోగలిగేవారు అనుకుంటూ అద్దంలోకి చూసాను. ఓ గొట్టై కనపడింది. ఇదేటీ, నా ఫేసు వేరేలా వుంటుంది కదా, అని మళ్ళీ కళ్ళు నులుపుకుని మరీ చూసాను. అయినా సరే నా ఫేసూ కాస్తా, గొట్టై ఫేసూ కాస్త రీమిక్స్ అయి కనిపించాయి. అంటే, అంటే నేను గొట్టైనా. కాబట్టే అందరినీ నమ్మేస్తానా? అజ్జిబాబోయ్, ఇదేటిది, మీరలా చెప్తా వుంటే నాకిలా గుర్తొచ్చేస్తా వున్నాయి...వోరి దేవుడోయ్, ఇన్నాళ్ళూ జనస్ ఆర్ యూజింగ్ మీ, అంటే తెలుగులో అందరూ నన్ను వాడుకు దొబ్బుతున్నారా? నాకు తెలిసీ నేను గొట్టై లాగ తలాడించి నమ్మేసి, వాళ్ళు చెప్పినవి ఫాలో అయిపోతున్నానా? హే భ హ గ హ వా హన్ ? హేమిటి నాకీ పరీక్ష? ఆఖిర్ మై క్యూం హూన్? (ఇవాల్టికింతే హిందీ వస్తోంది ఏవనుకోకండేం..). ఈ విధంగా బాధ పడుతూ బైటికొచ్చి పిల్లల్ని మా ఆవిడకి అప్పచెప్పి, నా వీలునామా ఎక్కడుందో వాళ్ళకి చెప్పి, వెళ్ళి పడుకున్నాను.

ఇరవై ఏళ్ళుగా గొట్టై జాబు లో ఉన్న నాకు ఎన్నెన్నో జ్ఞాపకాలు కళ్ళముందు కదులుతున్నాయి.

రెండు దశాబ్దాల క్రితం: ఊళ్ళో కొచ్చిన కొత్త. ఒహ రోజు సోంవారం పొద్దు, ఇంటికి ఫోనొచ్చింది. ముఖపరిచయం ఉన్న ఒక ఫామిలీ తాలూకు ఆడ లేడీసు. ఫోను చేసి

"మీరు, అన్నా ఈ బుధవారం మా ఇంటికి లంచికి తప్పు కుండా రావాలండీ" అని.

నేను తబ్బి ఉబ్బిబ్బైపోయాను, "మనకప్పుడే వూళ్ళో ఇంత రెస్పెక్టిచ్చేత్తనారేటీ అని".

వెంఠనే "వోయస్, ఒక్క మాటు అన్నని కనుక్కుని చెబుతానండీ, మీరు లైన్ లో ఉంటారా?" అనేసి ఆవిడేంచెబుతోందో వినేలోపు అన్నకి ఫోను చేసేసాను.

వాడు ఫోనెత్తి " అర్జెంటు మీటింగులో ఉన్నా. ఏంకావాలి?" అన్నాడు మెల్లిగా.

"ఇది అంతకన్నా అర్జెంటురా బాబు, ఆంటీగారు కూడా ఉన్నారు లైన్ లో" అనేసి

"ఆంటీ గారూ, ఆంటీ గారూ..." అన్నాను ఆర్తిగా.

ఆవిడ కట్ చేసినట్టుంది ఏమీ సౌండు వినపడలేదు.

"ఆవిడ ఫోను కట్ అయిందిరా. కానీ ఒరేయ్, ఈ బుధవారం మజ్జానం మనకి వాళ్ళింట్లో లంచిట్రా. కుమ్మేద్దాం..." అన్నాను మహదానందంగా.

అన్న ఓమాటు ఆలోచించి " నాకు ఆఫీసులో కుదరదు. అయినా అంత మునిగిపోయిందేవుంది, కావస్తే వీకెండు వెళ్దాం. కనీసం డిన్నర్ కైనా మార్చమను, అలా ఎప్పుడు పడితే అప్పుడు అందరిళ్ళకీ భోయనాలకి వెళిపోకూడదు. సర్లే మళ్ళీ చేస్తాను." అనేసి ఫోను పెట్టేసాడు.

నేను లేత గొట్టైని కదా అంచేత నాకు కాళ్ళు నిలవట్లేదు. వాళ్ళు భోజనం పెడతావంటుంటే వొద్దంటాడేవిట్రా బాబూ, చక్కగా నచ్చిన నాలుగు పదార్థాలూ మారు వొడ్డించుకుని తిని చక్కా రావాలి గానీ..అనుకుని మళ్ళీ ఆంటీ గారికి ఫోను చేసి

"ఆంటీ గారూ, ఆంటీ గారూ, మీకు ఇబ్బందిలేకపోతే మేము శనివారం రావచ్చాండీ? అన్నకి బుధవారం మజ్జానం కుదరదుటండీ, పాపం పని వుందిటండీ, మరి. పోనీ బుధవారం రాత్రన్నా సరేననమన్నాడండి" అన్నాను ఆత్రుతగా.

ఆవిడ ఓ మాటు ఆలోచించి "లేదండీ, సూర్యాస్తమయంలోపే పెట్టాలిటండీ. మీకు పెట్టేదాకా మేము ఏమీ తినకోడదుటండీ, మా మావగారు చెప్పారు, పంతులుగారు కూడా అలాగే చెప్పారండీ, కాబట్టి మీరు పొద్దున్నే రావాలండీ, నాకు ఏవిషయం చెప్పండి" అనేసి ఫోను పెట్టేసింది.

ఇంకా నావల్లకాలేదు. ఎంత రెస్పెక్టు? మనం తినేదాకా వాళ్ళంతా ఉపవాసమా? ఆహ్,అన్నగాడు రాగానే వాణ్ణేల్లాగైనా ఒప్పించేయాలి అనుకుని వాడుకోసం కాకిలా చూస్తూ కూర్చున్నాను. రాత్రి వాడొచ్చాకా అంతా చెప్పేసాను. వాడికి డౌటొచ్చి ఆవిడకి ఫోను చేసి విషయం కనుక్కుని వచ్చి, నాకు చచ్చే చీవాట్లెట్టాడు.

"వాళ్ళింట్లో తద్దినం భోజనానికి రమ్మన్నారు, నీకంతా ఒహటే తిండి గోల. చూసుకోక్కర్లే? నాన్నకి తెలిస్తే ఛంపుతారు" అనేసి వెళ్ళిపోయాడు.

పాపం గొట్టెకేం తెలుసు? ఏదో లేత గడ్డి అని వెళ్ళింది, ఆనక వూలంతా కోసేత్తారని ఎవరూహిస్తారు? అలా గొట్టె ని ముదిరిపోకుండా కాపాడాడు అన్న మా వూళ్ళో ఉన్నన్నాళ్ళూ. వాడు ఊరొదిలి వెళిపోయాకా మళ్ళీ పిల్ల గొట్టె ఎదగడం ప్రారంభించింది, ఆరేళ్ళ తరవాత.

పనిలేని గొట్టె తెలుగు సదస్సులూ, సంస్కృతీ చట్టుబండలూ అంటూ మొదలెట్టింది. పెతీ సభకీ శవాల ఫొటో గ్రాఫర్ లా ఒక వీడియో కెమేరా, అందరికీ మేత, తేనీరు, చిరు తిళ్ళూ, హాలు తుడుచుటకు చీపురూ, అన్నీ తుడుచుకొను కాగితములూ గట్రా తీసుకెళ్ళి, కొందరిని ఇళ్ళ కెళ్ళి మరీ మోసుకొచ్చి సభలు పెట్టేవాణ్ణి. నాతో కలిపి ఇరవైమందొచ్చేవారు. ఎప్పుడైనా ఎవరన్నా పెద్ద శాల్తీ వస్తే వారితో ప్రత్యేక సభొహటి ఏడిసేవాళ్ళం. దానిలో మధ్యలో లేచి ఒహాయన పెశ్న అడిగేవాడు. నేను అప్పుడప్పుడూ వీడియో తీసేవాణ్ణి, కేవలం అప్పుడప్పుడూ మాత్రమే పనిచేసే నా వీడియో కెమేరాలో. ఈ ప్రశ్నా పెద్దయ్య గారు ఆ కెమేరా కళ్ళలోకి కళ్ళెట్టి ప్రశ్న అడిగే వారు. కార్యక్రమం అయిన మర్నాట్నించీ, ఆ వీడియో క్లిప్పింగు కావాలని ఫోనులు.

"కాస్త బిజీగా వున్నాసార్. వీలు చూసుకుని చేస్తాను. దానికి చాలా టైము పడుతుంది" అన్నాను ఒకసారి.

అంతే ఆయన ఓ గంట అమ్మనా బూతులు తిట్టి, అప్పటినించీ కొన్నాళ్ళు ఎక్కడ కనబడ్డా "ఈయన సభ చేత్తాడండీ. వీడియో మాత్రం ఇవ్వడు" అనేవారు అదేదో నేను బాకీ వున్నట్టు.

వెంటనే కళ్ళమ్మట నీళ్ళెట్టేసుకుని ఆఫీసుకు రెండ్రోజులు సెలవ పెట్టి, ఆ దిక్కుమాలిన కెమేరాలోంచి పదార్థాన్ని లాగి తీసి వీడియో చేసి ఆయనకిత్తే " క్లారిటీ నీ మొహంలా ఏడిహినట్టుంది. ఈ సారి సరిగ్గా తియ్యి" అని సుద్దులు చెప్పి వెళిపోయారు.

గొట్టె "యెస్సార్, షూర్ సార్" అనేసి ఇంటికొచ్చేసింది.

మరి కాస్త పెరిగింది.

ఆనక గొట్టెకి తెలుగు నేర్పాలనే చిలిపి ఊహ కలిగింది. కొన్నాళ్ళు పిల్లలకి నేర్పింది. ఒనాడు ఒహాయన ఫోను.

"హెలో, ఏరా నువ్వేనా తెలుగు చెప్పేది"

"అవునండీ. అంటే యెస్సార్".

"చూడు, నేను చిన్నప్పట్నించీ గ్లామర్ స్కూల్"

"బావుందండి"

"అంచేత మనకి తెలుగు రాదు"

"బావుందండి"

"మా ఆవిడ పంజాబీ"

"బావుంటుందాండీ?" అనేసి నాలిక్కరుచుకుని "బావుందండి" అన్నాను.

"ఏంటయ్యా బావుండేది? ఇద్దరికీ రాపోతే పిలకాయలకి తెలుగు ఏ గాడిదికొడుకు చెప్తాడు?"

"బావుందండి"

"అంచేత నువ్వు చెప్పాల, మాకు ఓన్లీ సుక్కురారం రాత్రి ఏడునించి గెంట ఫ్రీ. నువ్వొచ్చిఫ్రీగా చెప్పేసి పోవాల"

"మీరెక్కడుంటారండీ?"

"మేము, ఎంతా, మీ పక్కూళ్ళో ఉంటాం. జస్ట్ రెండు గెంటల డ్రైవు. రేపు సుక్కరారంనించీ మొదలెట్టు. ఎడ్రసు కనుక్కో నా వెబ్ సైటు కెళ్ళి "

"బావుంది సార్. ఐ మీన్ యెస్సార్.." అనేసి ఫోను పెట్టి కమిలిపోయింది, అయ్ మీన్ కుమిలిపోయింది గొట్టె.

గొట్టెని అందరూ అన్ని అసోసియేషన్లలోనూ మెంబర్ చేసేసారు, మొహమాటం పెట్టి. వాళ్ళ సభలకి లాక్కుపోయేవారు. ఆనక ఎవరి సభ ఎక్కడ జరిగినా గొట్టె వెళ్ళి ఓ పాట పాడటవో పజ్జెం రాయటవో చేసేది. గొట్టెని అక్కడేవీ అందలవెక్కించక పోయినా,

"చూసారా, పులులు సింహాలు ఉన్న మా సంస్థలో గొట్టెలు యధేచ్ఛగా తిరగగలవు, కాబట్టి చూస్కోండి మేము ఎంత మంచి వాళ్ళమో" అనే తృప్తి కనబడేది అందరి ఫేసుల్లో.

ఎప్పటిలాగే మళ్ళీ వూలు వొలుచుకుని పంపేసేవారు. మాములుగానే గొట్టె సంతలో తిరగేసి ఇంటికొచ్చి పడుకునేది.

"ఏవయ్యా మనకో ఐదువేలు రాయి చెబుతాను, ఏంచేసుకుంటావు డబ్బంతా?" అందో మెకం ఓమాటు.

"ఎవరి డబ్బండీ?" అంది గొట్టె అమాయకంగా.

"నీదుంపతెగ, నీవేనెహె. ఊ నసక్కుండా వెంటనే చెక్కు రాసుకో, ఈ సారి సభలకి మేకలా రెడీ అవు, వెరైటీగా ఉంటది..".

"యెస్సార్" అనేసి తలూపేసింది గొట్టె.

అలా గొట్టె ఉన్ని పెరిగినప్పుడల్లా అది కావలసినవాళ్ళంతా క్షవరం చేసి పట్టుకుపోయి, గొట్టెని గొట్టెగా ఎదగనిచ్చారు.

ఆమజ్జెన ఒక కాల్ వచ్చింది.

"హలో" అంది గొట్టె.

అటునించి ఎవరెవరో కొత్తగా వ్యాపారం పెట్టినట్టున్నారు, బిజినెస్సు మాటాడుకుంటున్నారు.

"ఎందుకూ ఈ మాత్రం దానికి డబ్బులు తగలెయ్యడం, మన గొట్టె కి చెబితే సరి, ఫ్రీగా వచ్చి చేసెళిపోతాడు,పాడతాడుకూడా. పైసా ఇవ్వక్కర్లేదు."

గొట్టె మళ్ళీ "హలో.."అంది పీలగా.

"ఆ హలో హలో, గొట్టే, ఐ మీన్ వాసు గారు, మేం పార్టీ చేసుకుంటున్నాం. బిజినెస్ బావుండాలని పూజకూడా చేత్తున్నాం. మీరొచ్చి మొత్తం కార్యక్రమం మీ చేతులమీదగా జరిపించి వెళ్ళాలండీ" అనేసారు.

మామూలుగానే గొట్టె...మరి..అదన్నమాట.

ఆ రోజు కార్యక్రమంలో గొట్టె చెయ్యని పని లేదు. ఇంక గొట్టె ఉండపట్టలేక, అంట్లెత్తుతోన్న ఒక మెక్సికో బుల్లోణ్ణి అడిగేసింది

"నాకంటే వీళ్ళతో తప్పదు, నీకెందుకు ఈ అరవ చాకిరీ?" అని.

వాడో వెఱ్ఱి చూపు చూసి "నో ఇంగ్లీస్" అంటే, లాభం లేదని కష్టపడి సైగలతో అడిగింది.

అప్పుడు వాడు చెప్పాడు "నాకు కూడా గెంటకి పది డాలర్లిస్తారని".

అప్పుడనిపించింది గొట్టె కి. ఛీ దినెమ్మా జీవితం, ఎంతసేపు ఊలు క్షవరమే తప్ప మేతెట్టే యజమానెవడూ లేడన్నామాట, ఇంకెందుకీ గొట్టె బతుకు అని. అప్పట్నించీ కనీసం మేకలా ఐనా బతుకుదామని ప్రయత్నిస్తోంది, మేకపోతు గాంభీర్యం పెదర్శిస్తూను. మొహమాటానికి పోయి దాల్చిన గర్భాలు చాలు. ఇంక నిక్కచ్చిగా వుండాలని నిర్ణయించుకునే వేళలో ఓ ఫోను కాలొచ్చింది. ఏవయిందని అడక్కండి, వళ్ళు మండుతుంది.

ఇంతలో పిల్ల అడిగిన ప్రశ్నకి సమాధానం దొరికేసింది. ఇద్దరు పిల్లలనీ దగ్గిరెట్టుకుని, బొమ్మలపుస్తకంలో గొట్టె చూపిస్తూ "ఇదీ గొట్టె. ఎప్పుడూ యెస్సార్, షూర్ సార్, అలాగే చేసేస్తాను సార్" అంటుందన్నమాట అన్నాను బుద్ధుడిలా వెలిగిపోతూ.

## (వచ్చే సంచిక దాకా లైట్ తీస్కోండి!)

POST YOUR COMMENTS